సుజాతకి, మురళికి పెళ్ళి జరిగింది.

చదవటానికి, రాయటానికి ఈ వాక్యం ఎంత సులభంగా వుందో, అంత సులభంగానే జరిగింది వాళ్ళ పెళ్ళి. ఆ వాక్యం అర్థం అవటంలో ఏమంత కష్టంలేదుగాని, సుజాత మురళిని పెళ్ళి చేసుకోవటానికి ఎందుకు ఒప్పుకుందో ఎవరికీ అర్థం కాలేదు.

సుజాత కుటుంబానికి వంశ పారంపర్యంగా దైవభక్తి సంక్రమిస్తూ వచ్చింది. ఇంట్లో వున్న ఒక్కొక్కరికీ ఒక్కొక్క దేవుడిమీద భక్తి.

సుజాతకి ఎనిమిదేళ్ళ వయసులోనే హనుమాన్ చాలీసామొదలు, వేంకటేశ్వర సుప్రభాతం వరకు కంఠతా వచ్చును. కాలేజిలో చదివే టప్పుడు డ్రాకులా సినిమాలు, హిచ్‌కాక్ సినిమాలుచూశాక తనకి తన స్నేహితురాళ్ళకి లాగా నిద్రలో పీడకలలు రాకపోవటానికి కారణం పడుకోబోయే ముందు తను ఆంజనేయ దండకం పఠించడమేనని సుజాత అభిప్రాయం. పిరుదులుదాటే తన జడలో మూడు అంగుళాలు తిరుపతి దేవుడికి ఇస్తానని మొక్కుకోవడం తను ఎంతో దృఢంగా పాసవ్వను అనుకున్న బియస్సీ పాసవడానికి కారణం అని సుజాత అనుకుంది. (మూడు అంగుళాలు అంటే ఖచ్చితంగా మూడు అంగుళాలు ఇవ్వకపోతే ఆ వడ్డికాసుల వాడికి కోపం వస్తుందని తిరుపతి వెళ్ళినప్పుడు సుజాత స్కేలు కూడా పట్టుకు వెళ్ళింది.) విగ్రహాల్లోనే కాదు. మనుష్యుల్లో కూడా దేవుడిని చూడటం తన కుటుంబం నించే నేర్చుకుంది సుజాత. అప్పుడప్పుడు తను చూసిన గాడ్‌మెన్ ప్రవర్తనలు పరిసరాలు, తన భక్తి మొదలైన వాటిని తను చదువుకున్న చదువు దోపిడిగా, మూఢత్వంగా కొట్టిపారేసిన సమయాలు లేకపోలేదు. కాని ఏదో తెలియని "శక్తి" వెంటనే "తప్పు – దైవదూషణ తప్పు" అని చెంపలు వేసుకునేట్లు చేసేవి.

ఇక మురళి విషయానికి వస్తే అతనికి తన తల్లిదండ్రుల గురించి తెలిసిన విషయాలు: వారి పేర్లు, ఫొటోలో వారి రూపురేఖలు. చిన్నప్పటి నుంచి మేనమామ దగ్గర పెరిగాడు. అతని మేనమామ బ్రహ్మసమాజ పద్ధతుల్ని అనుసరించినవాడు. చిన్నప్పటి సంగతి ఎట్లా వున్నా, పెద్దయ్యాక మురళికి దేవుడు లేడు అన్నమాట నిశ్చయంగా తెలిసినట్లయ్యింది. దేవుడు, దయ్యం, పూజ పునస్కారం అన్నీ బూటకాలు అని నమ్మటం ప్రారంభించాడు. అతను ప్రయోజకుడు అయి తన జీవితం తను నడుపుకోగలను అనుకుంటుండంగా అతని మేనమామ చచ్చిపోయాడు. దాంతో అతనికి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవటానికి ఏ విధమయిన అవరోధాలు లేకుండాపోయాయి.

సుజాత తండ్రి పించన్ పుచ్చుకోవటం ప్రారంభించిన కొత్తలోనే సుజాతకు పెళ్ళి సంబంధాలు చూడసాగాడు. అంతకు మునుపు ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఏమంత కష్టపడకుండా చెయ్యటానికి తను ఆ సమయంలో వెలగబెట్టిన తాశీల్దారు పదవి కారణం అని, సుజాత పెళ్ళికి తను కష్టపడటానికి తను ఈ లోకం బ్యాంకులో డబ్బు నిలవ వెయ్యటానికన్నా పైలోకం ప్రాధాన్యత ఇవ్వటం ఇంకో కారణం అని ఆయనకు తెలిసి వచ్చింది. ఆ సమయంలో తెలిసిన వాళ్ళు ఆయనకు మురళి గురించి చెప్పారు. పిల్లవాడు మంచివాడు, బాగానే సంపాదిస్తున్నాడు. అందంగానే ఉంటాడు. అత్త పోరు ఆడపడుచు పోరు వుండవు. అంత వరకూ బాగానే వుంది. కాని పిల్లవాడికి మంత్రాల పెళ్ళిళ్ళలో నమ్మకంలేదు. అంతే కాదు వడుగు చేసుకోలేదు. చేసుకోడుట కూడా. అయితే ఈ సంబంధం గురించి ఆలోచించనక్కరలేదు అనుకున్న సుజాత తండ్రి ఆ తరువాత ఒక విషయం విని ఇంక ఆలోచించలేదు. అది మురళి కట్నం తీసుకోడు అన్న విషయం. ఇంక సుజాత ఒప్పుకుంటే ఒప్పుకుని పెళ్ళిచూపులకు కూర్చుంటే, ఆ పిల్లవాడికి సుజాత నచ్చితే (ఎందుకు నచ్చదు? బంగారపు బొమ్మ"!) సుజాత పెళ్ళి అయిపోయినట్లే.

**దేవుణ్ణి భక్తితోనే కాదు స్కేలుతోకూడా కొలవచ్చుననే సుజాతకు, ఆమె నాస్తిక భర్తకు జరిగిన మన్మథలీల**

ఎవరూ వూహించని విధంగా సుజాత సరే అంది. సుజాత మురళి నాస్తికుడని తెలిసికూడా ఒప్పుకోవటానికి తమ ఆర్థిక పరిస్థితులు తెలియటం ఒక కారణం. రెండో కారణం మాటలలో పెట్టటం కష్టం. ఎందుకంటే సుజాతకే అది సరిగ్గా తెలియదు – ఒక నాస్తికుడిని దైవభక్తుడిగా మార్చాలనో ఏదో.

తనకి సుజాతలాంటి అందమయిన భార్య వస్తుందంటే నమ్మలేకపోయాడు మురళి. నమ్మాక ఓకే అన్నాడు.

సరే పెళ్ళి జరిగింది.

మొదటిరోజులు గడచిపోయాక, సుజాత మురళిని మార్చటం అనే ప్రణాళికలో మొదటి అంశం క్రింద అతనికి పౌరాణిక సినిమాలు చూపించాలి అనుకుంది. అనుకుని అతన్ని "సంపూర్ణ భాగవత భారతాలు" అనే సినిమాకి ప్రయాణం కట్టించింది. మురళి కాదనకుండా బయలుదేరాడు. టిక్కెట్లు తీసుకున్నాక అడిగింది సుజాత, "మీరు నాస్తికులు కదా మరి ఈ సినిమాకి ఎట్లా వచ్చారు?" అని. అతని జవాబు విని తెల్లబోయింది.

"నాకు ఎందుకనో సినిమా హాలులో పట్టే నిద్రలాంటి గాఢనిద్ర ఇంక ఎక్కడా పట్టదు. పౌరాణిక సినిమాలయితే హాయిగా నాలుగు గంటలు పడుకోవచ్చు కదా!" అన్నది అతని జవాబు.

అంశం మార్చక తప్పలేదు సుజాతకి.

ఒక రోజున మురళి మంచి మూడ్‌లో వుండగా, సుజాత తను పెళ్ళి కాకపూర్వం ఎట్లా పూజలు చేసేదో, గుడికి వెళ్ళేదో చెప్పసాగింది.

"మరి ఇప్పుడు గుడికి వెళ్ళటం లేదే?" అన్నాడు మురళి.

"మరి మీరు ఒప్పుకుంటారా?"

"దానికేముంది. ఎవరి భావాలు వారివి. నీకు ఇష్టమయిన పనులు నువ్వు చేస్తావు. నాకు ఇష్టంలేదు అని మానలేవుకదా?"

"మరి నేను ఒక్కదాన్నే వెడితే ఏం బాగుంటుందండి? మీరు కూడా రండి" అంది సుజాత.

చేప వలలో పడింది. పెళ్ళి అంటే తన ఎస్సెట్సు ఇంకొకరితో పంచుకోవడమే గాక, ఇంకొకరి లయబిలిటీస్ కూడా తను పంచుకోవాల్సి వస్తుందని తెలిసింది మురళికి. దాంతో సుజాతతో కలిసి అప్పుడప్పుడు గుడికి వెళ్ళక తప్పలేదు అతనికి.

మురళి లెక్చరర్‌గా పని చేస్తున్న కాలేజీకి వేసవి సెలవులు ఇచ్చిన రోజున అంది సుజాత. "మనం తిరుపతి వెళ్ళాలండి. స్వామివారి ఉత్సవాలు వుంటాయి. పైగా నాకు మొక్కుకూడా వుంది" అని.

"నేను రెడీ" అన్నాడు మురళి. ఆహా! నోము ఫలించె కదా అనుకుంది సుజాత.

"తిరుపతిలో నా ప్రాణ స్నేహితుడు వున్నాడు. ఆ వెధవకి నాలాగే వుత్తరాలు రాయటం అంటే బద్ధకం. ఇప్పుడు కలిస్తే దాదాపు రెండేళ్ళ తరువాత అన్నమాట" అన్నాడు మురళి.

# దేవుడే గెలిచాడు!

కె. వి. యల్. యస్. ప్రకాష్




సుజాత ప్రయాణానికి కావాల్సిన, కొనాల్సిన సామాన్ల లిస్టు తయారుచేసింది. అందులో స్కేలుకూడా వుండటంతో మురళి ఆశ్చర్యపోయి, "అమ్మాయి! నువ్వు దేవుడిని భక్తితోనేకాక స్కేలుతో కూడా కొలుస్తావా?" అన్నాడు నవ్వుతూ.

"నాకు మీతో పెళ్ళి జరిగితే స్వామి వారికి మూడున్నర అంగుళాలు జుట్టు సమర్పించుకుంటానని మొక్కుకున్నాను. మరి ఇచ్చే మొక్కులో ఎక్కువ తక్కువలు వుండకూడదు కదా?" అంది సుజాత లెంపలు వేసుకుంటూ. (ఆడవారు చదు




రమణి తీర్చు రంగవల్లులు

చిత్రం : నేరేడుమిల్లి సత్యనారాయణశర్మ, కొత్తవలస

వులకన్న పెళ్ళికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు అన్నది సుజాత మొక్కుల వలన తెలుస్తున్నదా?)

"చూశావా? దేవుడు ఎంత గొప్ప వాడో?" అన్నాడు మురళి చటుక్కున నవ్వటం ఆపి.

తిరుపతి ప్రయాణం అనుకున్నంత మాత్రానే శ్రీవారు దేవుడి గురించి ఫేవర బుల్‌గా మాట్లాడటంతో సుజాత స్వామి వారి మహత్యంకి ముగ్ధురాళయిపోయి తన మొక్కును మూడున్నర అంగుళాలనించి నాలుగు అంగుళాల వరకు పెంచుదామా అని ఆలోచిస్తూ "ఎందువల్ల?" అంది.

"నువ్వు ఇట్లా మూడున్నర అంగుళాల మొక్కులు ఇంకా మొక్కుతూనే వుంటావు. మనం తిరుపతి వెళ్ళినప్పుడల్లా నేను స్కేలు కొనటం అది మళ్ళీ ప్రయాణంలో కనబడకపోవటం, మళ్ళీ కొనటం, ఇన్ని అవస్థలు ఎందుకని ఆ దేవుడు నువ్వు ఎవరితోనయితే పెళ్ళి జరిగితే మూడున్నర అంగుళాలు అని మొక్కుకున్నావో ఆ వలాని వీడికి మూడున్నర అంగుళాల ముక్కు వుండేట్లు చేశాడు. ఎంత విచిత్రం! ఎంత మహత్యం. ఇంక నీకు స్కేలుతో పని లేదు. నువ్వు రెండున్నర అంగుళాలు అని అనుకున్నావనుకో నా చూపుడు వేలు...."

"అపచారం! అపచారం!" అంది సుజాత లెంపలు వేసుకుంటూ.

మొదట్లో మురళి సుజాత ఫీలింగ్స్ (దేవుడికి సంబంధించినంత వరకూ) హర్ట్ కాకుండా ప్రవర్తిస్తూ వచ్చేవాడు. కాని ఎప్పుడయితే సుజాత తనను గుడికి (ఒక సారి భజనకి కూడా తీసుకువెళ్ళింది— ఒక పున్నమి వెన్నెల రాత్రి వృథా అయిపోయాక మురళికి తప్పలేదు) తీసుకు వెళ్ళటం ప్రారంభించిందో అప్పటినుంచి సుజాతని నవ్వులాట పట్టించసాగాడు.

తిరుపతి ప్రయాణం అనుకున్న మర్నాటి నుంచి సుజాత తన క్రాపువంక ఆప్యాయంగా చూడటం, మాటి మాటికి సవరించడం మొదలుపెట్టేటప్పటికి మురళికి కంగారు పట్టుకుంది. గుండు చేయించుకోవటం ఎంత అనాగరికమో చెప్పిన పాయింటు చెప్పకుండా చెప్పసాగాడు. దానికి కౌంటరుగా సుజాత గుండు చేయించుకున్న మొగవాళ్ళు ఎంత ముద్దు వస్తారో వర్ణించసాగింది.

ప్రయాణంలో ఎదురయిన ప్రతి అవాంతరానికి కారణం మురళి దేవుడిమీద జోకులు వెయ్యటమేనని తేల్చిపారేసింది సుజాత. చివరికి తిరుపతిలో తనకోసం ఎదురు చూస్తూ వుండాల్సిన మిత్రుడు అనుకోని పని మూలంగా హైదరాబాద్ వెళ్ళిపోవటంతో సుజాత మాటలలో నిజం వుందేమో అని మురళికి అనిపించింది.

తిరుపతినుండి సరాసరి కంచికి వెళ్ళి పట్టుచీర కొంటానని మాట ఇవ్వటంతో సుజాత, మురళి "గుండు" గురించి సతాయించటం మానింది.

కంచి ప్రయాణం మర్నాడు అనగా ఆ రోజు పొద్దున మురళి అకౌంట్సు రాయసాగాడు. పర్సులో మిగిలిన డబ్బు లెక్కపెట్టి పర్సును జాగ్రత్తగా సూట్‌కేసులో పెట్టి "అంగుళం జుట్టు ఈజ్ ఈక్వల్ టు నూటముప్పై అన్న మాట" అన్నాడు.


మొత్తం 42 గల వమూనా

| | | | |
|---|---|---|---|
| 9 | 14 | 7 | 12 |
| 18 | 3 | 16 | 5 |
| 11 | 10 | 13 | 8 |
| 4 | 15 | 6 | 17 |

గొప్ప అవకాశం

(ట్రాన్సిస్టర్ల ప్రచారం కొరకు అమ్మకమునకు చేయు పథకం)

మొదటి బహుమతి ; మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి ; పై మూడు అడ్డ వరుసలలో సరియైనది అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి ; (200) లేక అంతరు ఎంట్రీవారులకు ఎక్కువైన ఏ అంకైన సరియైనది అయినచో సోని 8 బ్యాండ్ ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టరు ధర ; 270/–లో సగం ధర:

నిబంధనలు : దిగువ నీయబడినవి జాగ్రత్తగా చూడండి. 1. ఖాళీ కాగితముపై 4 నుండి 19 వరకుగల అంకెలను ఉపయోగించి ఎటు కూడినా మొత్త 48 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డు సొల్యూషన్ మా కార్యాలయమునందుంచబడినది. అది ఎమ్. డి. చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు ఈ సీల్డు సొల్యూషన్‌తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేని యెడల మొదటి, రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందిన వారు పోస్టేజి ఖర్చులు మొదలయినవి చెల్లించాలి. 5. మూడవ బహుమతి గెలుపొందినవారికి నగదు బహుమతులుండవు. 6. ఫలితము మరియు స్టేషనరీ కొరకు 45 పైసల స్టాంపులు పంపండి. 7. లావాదేవీలు ఆలీఘర్ సివిల్ కోర్టునందు మాత్రమే.

ముగింపు తేదీ : 24-1-77 ఫలితం : 26-1-77

MAYUR TRADERS (AJW-46) Jaiganj, ALIGARH-30.

"అదేం?" అంది సుజాత మురళి నుదుట కుంకం పెడుతూ.

"నీ మొక్కు కోసం ఇక్కడకి వచ్చామా? మనకి నాలుగు వందల యాభై రూపాయలు ఖర్చు-అంతేఅంగుళానికి...."

"తప్పు. లెంపలు వేసుకోండి. అసలు ఈ డబ్బంతా స్వామివారిది కాదా? అసలు డబ్బేం ఖర్మ అంతా స్వామివారిది కాదా?" అంది సుజాత.

"సరే నమ్మాయి మన దగ్గర వున్న స్వామి వారి డబ్బుతో ఆ కాంటిన్ వాడి దగ్గరవున్న స్వామి వారి కాఫీ తాగి నా దగ్గర వున్న స్వామివారి తలకాయ నెప్పి పోగొట్టుకుందాం రా!" అన్నాడు మురళి జేబులో వున్న చిల్లర కాఫీకి సరి పోతుందా అని చూసుకుంటూ.

కాటేజికి తాళంవేసి కాఫీ తాగి వచ్చారు. తాళం తీసి లోపలికి వెళ్ళిన వాళ్ళకి ఒక వింత దృశ్యం కనబడింది. గదిలో సూట్ కేసుమీద ఒక కోతి కూర్చుని వుంది. వీళ్ళిద్దర్నీ చూసి లోపలికి రండి అన్నట్లు నవ్వింది.

దాన్ని తరమబోవటం ప్రమాదకరం అవుతుందా లేదా అన్నది తెలుసుకోవాలని మురళి "కోతి కరుస్తుందా? గీరుతుందా? ఒకవేళ కరిస్తే అది విషమా? గీరితే డేంజరా?" అన్నాడు మెల్లిగా కోతికి విన పడ కూడదు అన్నట్లు.

"జువాలజి పుస్తకాలలో అట్లాంటివి రాయలేదండి" అంది సుజాత తన చదువు నెమరువేసుకుంటూ.

"ఇవన్నీ చెప్పకుండా కోతికి ఇన్ని జతికలు, ఇన్ని కర్ణికలు అని చెప్పితే ఏం ప్రయోజనం?" అన్నాడు కోపంగా మురళి పళ్ళు నూరుతూ. ఇంటికి వెళ్ళంగానే సిల బస్ మార్చమని యూనివర్సిటికి ఘాటుగా పత్రం రాయాలనుకున్నాడు.

ఎవరికీ ధైర్యం తెచ్చుకుని సుజాతని బాత్‌రూమ్‌లో గడియపెట్టుకుని వుండ మన్నాడు. తను ఒక కుర్చీ అడ్డుగా పెట్టు కుని కోతిని గదిలోంచి హాలులోకి హాలు లోంచి వరండాలోకి, వరండాలోంచి రోడ్డు మీదకి, రోడ్డు మీదనుంచి దగ్గరలో వున్న చెట్టు మీదకి అంచెల వారీగా తరి మాడు.

దింళ్ళవె కిలోమ్‌రూత్‌బా చిదా లోట్టు కెజా ర్బుప నిలోసుకేట్‌సూ త జాసు గాడంపు లోంత్నయ్ర్ప ఆ నుతల.

కుర్చీని హాలులో పడేసి "సుజాతా! విక్టరీ మనదే" అన్నాడు మురళి ఆయాస పడుతూ.

"కోతి వెళ్ళి పోయిందా" అంది సుజాత తలుపు తీయకుండా

## గాథావళి:

# మనిషి కాళ్ళు ఎంత పొడవుండాలి?

డొగ్లస్ అనే ఆయన చాలా పొట్టి వ్యక్తి. లింకన్ స్నేహితు లందరు డొగ్లస్‌ను గురించి మాట్లాడుకుంటూ మనిషికి కాళ్ళు ఎంత పొడవుంటే బాగుంటుంది అని ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. తరువాత కొన్ని నిమిషాలకు అబ్రహాం లింకన్ వచ్చి వాళ్ళతో కలిసి వాళ్ళు మాట్లాడుకుంటున్న విషయం తెలుసుకొని ఇలా అన్నాడు: "నేననుకుంటాను, ఎవరికైనా వాళ్ళ కాళ్ళు భూమిని ఆనేంత పొడవుంటే చాలు" అన్నాడు.



—ఎస్. ఎం. లక్ష్మీదేవి

"వెళ్ళింది!"


"చూస్తుంటే వెంకటేశ్వరస్వామి వారికి కోపం వచ్చి హనుమంతులవార్ని పంపినట్లున్నారు." అంది బాత్ రూమ్ లోంచి బయటకు వచ్చి. గదిలోకి వెళ్ళి సూట్‌కేసుమీద కోతి కూర్చున్న స్థలాన్ని కళ్ళకు అద్దుకుంది.

"చూశావా? నీ పతిదేవుడు ఎంత గొప్ప వాడో? ఆ ఆంజనేయులవార్ని కూడా జయించాడు" అన్నాడు మురళి ఛాతి విరుస్తూ.

"మీరు అట్లాగే నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ స్వామివారికి కోపం తెప్పిం చండి. సరేగాని ఒక రెండు రూపాయలు ఇవ్వండి. పళ్ళుకొని ఆంజనేయ స్వామికి నివేదిస్తేగాని నాకు మనశ్శాంతి వుండదు" అంది సుజాత.

సూట్‌కేసు తెరిచి పర్సుకోసం చూశాడు మురళి. పర్సులేదు.

"మీరు సూట్‌కేసులోనే పెట్టారా? లేక పోతే ఇంకెక్కడన్నా....?"



తెల్లమచ్చలు

మా మందు వాడిన మూడు రోజుల లోపే తెల్లమచ్చలు రంగు మారి మామూలు శరీరపు రంగు వచ్చును. ఒక సీసా మందు ఉచితముగా ఇవ్వబడును. ఆర్డరు పంపి పూర్తిగా నయం చేసుకోండి. మీ పూర్తి చిరునామా ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

KANCHAN AUSHADALAYA (7)
P. O. KATRISARAI (GAYA)

నెరసిన శిరోజాలకు స్వస్తి చెప్పండి

ఆయుర్వేదిక్ మన్ మోహిని సువాసన తలనూనె నెరసిన శిరోజాలను సహజమైన నలుపు రంగుగా శాశ్వతంగా మార్చును. మెదడుతో పని చేసేవారికి కూడా చాలామంచిది. ధర : రు. 10-50 పూర్తి కోర్సు : రు. 29-00.

KESH KALYAN BHAWAN (A.K)
P. O. Maira Barith (Patna)

డా॥పి.వి.కె.రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్య విద్వాన్. వైద్యాచార్య హస్త ప్రయోగం. నరముల బలహీనత. అంగము విన్నదగుట. శీఘ్రస్ఖలనము. శుక్ల నష్టము. సుఖరోగములకుమానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

SUVARNA




# అదను

నిశీథాన్ని కప్పుకొని
నిద్రపోతున్న పాట
ఎర్రగా కళ్ళు తెరిచి
ఆగామి రాగాల కోసం
ఆలాపన మొదలుపెట్టింది

శిథిలమైన గోరీల పగుళ్ళలో
చిక్కుకున్న పిచ్చిమొక్కలు
కొత్త గాంధర్వాన్ని మోసుకొచ్చిన
గాలి పిల్లలతో
రేపటి ఆనందాన్ని చర్చిస్తున్నాయి

గుండె లోతుల్లో మ్రోగుతున్న
రణన్నినాదాలను
ఆయుధాలుగా ధరించి
అణువు పగిలే సమయం కోసం
ఆత్రంగా ఎదురు చూస్తున్నారు
జనం!

—అదృష్ట దీపక్

"లేదు. మనం కాఫీకి వెళ్ళబోతూ అకౌంట్సు రాసి పర్సు సూట్ కేసులోనే పెట్టాను." అన్నాడు మురళి చీరలు, పాంట్లు విడివిడిగా సూట్ కేసులోంచి తీస్తూ. పర్సు దొరకలేదు. ఇంకా ఎక్కడా పెట్టలేదు. అన్న మురళి కూడా కాటేజి అంతా వెతికాడు. కాని పర్సు కనబడలేదు.

"మీరు గుండు చేయించుకోకపోగా గుండు చేయించుకోవటం అజ్ఞానం అన్నారు. నా డబ్బులు నా డబ్బులు అని గొప్పలు పోయారు. అసలు ఇందాక ఆ కోతిని అందుకోసమే స్వామివారు పంపి వుంటారు" అంది సుజాత, అని కోవెల వున్న దిక్కుకి సాష్టాంగపడి రెండు నిముషాలు ప్రార్థించింది.

"ఇప్పుడెట్లాగా?" అన్నాడు మురళి ఏడుపు గొంతుతో. పర్సులో పదకొండు వందలు వున్నాయి మరి. తాళం వేసిన కాటేజిలో, సూట్ కేసులో వున్న పర్సు మాయమవటంతో, అందులోనూ కోతి వచ్చి వెళ్ళిన తరువాత-"అతీత శక్తులు వున్నాయి" అని అనిపించింది మురళికి.

"మరేంఫర్వాలేదు! మీరు మనస్ఫూర్తిగా దేవుడికి మొక్కుకోండి. ఒకసారి మా బాబాయికి ఇట్లాగే జరిగింది, అని రెండు నిదర్శనాలు చెప్పింది సుజాత. ముందు తల స్నానంచేసి రండి. తరువాత దేవుడికి మొక్కుకుందురుగాని."

తల స్నానంచేసి వచ్చిన మురళి మెదడులో తను బాగా నమ్మిన, తనకు అర్థం అయిన భావాలకు, అర్థంకాని, నమ్మలేని శక్తులకు పోరాటం జరుగుతున్నది.


సూట్ కేసులోంచి పట్టుపంచె తీద్దామని సూట్ కేసు దగ్గరికి వెళ్ళి పంచె తీశాడు. ఆశ్చర్యం. అందులోంచి పర్సు జారి పడింది.

మురళి మెదడులో పోరాటం ఆగిపోయింది.

ఆనాటి నుంచి మురళి వెంకటేశ్వర స్వామికి మిగతా రెండు కోట్ల తొంభై తొమ్మిది లక్షల తొంభైతొమ్మిది వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది దేవగణానికి వున్న అసంఖ్యాక భక్తకోటిలో ఒకడయ్యాడు. ★

గమనిక : మురళి కోతిని తరుముతున్న సన్నివేశంలో ఒక వాక్యం అస్తవ్యస్తంగా పడ్డది. దాన్ని వెనుకనుంచి ముందుకి చదవవలసిందని, పాఠకులకు ఈ అసౌకర్యం కలిగించినందులకు మన్నించాలని మనవి.

—రచయిత



సంక్రాంతి ముగ్గు

టి. హరిప్రియ, నిట్టంపురము